

తిరుపతి కన్నీరు పెట్టిన వేళ...

అఖిలాండకోటి భక్తజనం కన్నీరు పెట్టింది. తిరుపతి నగరం దుఃఖ సముద్రంగా మారిపోయింది. వైకుంఠద్వార దర్శనాల కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చి అశువులుబాసిన వారిని చూసి గుండె పగిలేలా ఏడ్చింది. బుధవారం రాత్రి బైరాగిపట్టెడ పార్క్ ప్రధాన గేటు వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన ఆరుగురి మృతదేహాలున్న.. రుయా మార్చురీ ప్రాంతం ఏడుపులతో నిండిపోయింది. గాయపడిన వారున్న స్విమ్స్ పద్మావతి ఆసుపత్రి.. నాయకుల పరామర్శలతో కిక్కిరిసింది. ఏర్పాట్లలో వైఫల్యమా? భక్తోత్సాహపు ఆత్రుతా? నిర్వహణ లోపమా?.. కారణాలు ఏవైనా కన్నుమూసింది మాత్రం అమాయకపు, సాధారణ భక్తజనం. లక్షల పరిహారాలు.. పోయిన ప్రాణాలను వెనక్కి తీసుకురావు. విపక్షపు నిందలు.. ఓదార్పునివ్వవు. వైకుంఠద్వారాల్లోంచి స్వామి దర్శనం కోసం వచ్చి విగతజీవులైన తమవారి దేహాలతో కుటుంబసభ్యులు స్వస్థలాలకు పయనమయ్యారు.





చంద్రబాబు ఓదార్పు



పవన్ కల్యాణ్ పరామర్శ



జగన్ పలకరింపు



మంత్రుల భరోసా

మనసు కలత చెందింది

తిరుపతి సంఘటన నా మనసును కలిచివేసింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయాలకతీతంగా వెంకన్నకు సేవ చేస్తున్నామన్న భావనతో అందరం ముందుకెళ్లాలి. అధికారయంత్రాంగం సమన్వయంతో ఇలాంటి అపశ్రుతులు జరగకుండా జాగ్రత్త పడాలి. ఇటువంటి సంఘటనలు ఇక జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- సీఎం చంద్రబాబు

క్షమించండి !

ఈ ఘటనకు శ్రీవారి భక్తుల్ని, రాష్ట్ర ప్రజల్ని, హైందవ ధర్మాన్నీ.. ఇలా ప్రతి ఒక్కరినీ క్షమించమని ప్రభుత్వం తరుపున కోరుతున్నా. తప్పు జరిగిందని తప్పించుకోవడంలేదు. బాధ్యత తీసుకుంటున్నాం. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనే ప్రణాళిక కూడా లేదు. అధికారులు చేసిన తప్పులకు మేము తిట్లు తింటున్నాం. టీటీడీలో ప్రక్షాళన మొదలుకావాల్సిన అవసరం ఉంది.

- డిప్యూటీ సీఎం పవన్

ప్రతిష్ట దిగజార్చారు

టీటీడీ పరువు ప్రతిష్ఠను దిగజార్చింది చంద్రబాబు ప్రభుత్వమే. టీటీడీ ఛైర్మన్, ఉన్నతాధికారులతో పాటు బాబు కూడా బాధ్యుడే. కుప్పం పర్యటనకు పోలీసులను తరలించి, ఇక్కడ ప్రత్యామ్నాయం చూడకపోవడం కూడా తప్పిదమే. సీఎం పర్యటనకు ఇచ్చిన ప్రాధాన్యత భక్తులకు ఇవ్వలేదు. ఇది ఓ బ్లాక్ మార్క్‌లా నిలిచిపోతుంది.

- మాజీ సీఎం జగన్

తిరుపతి, జనవరి9(ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఆరుగురి మృతి నేపథ్యంలో గురువారం తిరుపతి నగరం ఉక్కిరి బిక్కిరి అయ్యింది. సీఎం, డిప్యూటీ సీఎం, విపక్ష నాయకుడు, మంత్రుల రాకతో ఘటన జరిగిన బైరాగిపట్టెడ ప్రాంతం, క్షతగాత్రులున్న స్విమ్స్ పద్మావతి ఆసుపత్రుల ప్రాంగణం ఓదార్పులతో హోరెత్తిపోయింది. ఉదయం ఎనిమిదింటికే మంత్రుల బృందం రుయా ఆస్పత్రికి చేరుకుంది. హోం మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రుయా మార్చురీవద్ద విలపిస్తున్న మృతుల బంధువులను ఓదార్చారు. దగ్గర ఉండి మృతదేహాలను వారి స్వస్థలాలకు అధికారులను వెంట ఇచ్చి పంపించారు.

చంద్రబాబు ఆగ్రహం

మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు బైరాగపట్టెడలోని పద్మావతి పార్కుకు చేరుకుని ఘటనా స్థలానికి పరిశీలించారు. అక్కడే ఉన్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని తప్పుగా అభివర్ణించారు. అక్కడనుంచి నేరుగా మధ్యాహ్నం 2.40 గంటలకు స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. దాదాపు గంటకు పైగా వారితో పాటు బంధు మిత్రులతో మాట్లాడారు. సంఘటన ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. దురదృష్టకర ఘటనపై చింతించారు. ఆతర్వాత టీటీడీ పరిపాలన భవనంకు చేరుకుని తొక్కిసలాట ఘటనపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో ఎస్పీ సుబ్బారాయుడు, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్‌లను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, డీఎస్పీ రమణకుమార్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు. మీడియా సమావేశం అనంతరం సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో తిరిగి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు పయనమయ్యారు.

మండిపడ్డ పవన్

సీఎం చంద్రబాబు టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో ఉండగానే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3.30గంటలకు తిరుపతి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా తొక్కిసలాట చోటు చేసుకున్న బైరాగిపట్టెడ ప్రాంతంలోని పద్మావతి పార్క్ రామానాయుడు పబ్లిక్ స్కూల్ పరిసరాలను పరిశీలించారు. అక్కడ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు ఆనంద సాయితో పాటు అధికార యంత్రాంగంతో చర్చించారు. ప్రమాదానికి గల కారణాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సాయంత్రం 4.20గంటలకు స్విమ్స్‌కు చేరుకొని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి గాయాలైన వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. చికిత్స పొందుతున్నవారినీ, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆస్పత్రి బయటకువచ్చి మీడియాతో మాట్లాడారు. టీటీడీ, పోలీస్ అధికారుల వైఫల్యాలపై మండిపడ్డారు. తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ క్షమించమని వేడుకున్నారు.

జగన్ హడావుడి

పవన్ మీడియాతో మాట్లాడుతుండగా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో తన అనుచరగణంతో ఆస్పత్రికి చేరుకున్నారు. ఈసందర్భంగా వైసీపీ శ్రేణులు నానా యాగీచేయడంతో విమర్శలకు గురయ్యారు. తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండు చేశారు.

కుట్రకోణంపై పవన్ అనుమానాలు

వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటపై కుట్రకోణాలు దాగివుందని వస్తున్న అనుమానాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లేవనెత్తారు. ముఖ్యంగా పోలీసుల వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. అంతేకాకుండా స్విమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పవన్ పరామర్శించి బయట మీడియాతో మాట్లాడుతుండగా అప్పుడే జగన్మోహన్ రెడ్డితో పాటు వైసీపీ ముఖ్యనేతలను పోలీసులు ఆసుపత్రి లోపలకు అనుమతించడంపై పవన్ తప్పుబట్టారు. ఉద్విగ్న పరిస్థితుల నేపథ్యంలో ఒక నాయకుడు పర్యటనకు వచ్చినపుడు అదేస్థానానికి మరో నాయకుడిని ఎలా అనుమతిస్తారని పవన్ ప్రశ్నించారు. ఇదేదో ఉద్దేశ్యపూర్వంగా చేస్తున్నట్టు కనిపించిందని తిరుగు ప్రయాణంలో విమానాశ్రయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వద్ద ఈ అంశంపై మాట్లాడారు.





ఘటన జరిగిన టోకెన్ల జారీ కేంద్రంలో చేసిన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం

తేలిన గృహ లబ్ధిదారుల లెక్క

- 2016-19 మధ్య నిర్మించుకున్నవారికి బిల్లులు
- చిత్తూరులో 29,093 మందికి రూ.47.19 కోట్లు
- తిరుపతిలో 23,484 మందికి రూ.39.06 కోట్లు



లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే చేస్తున్న హౌసింగ్ అధికారులు

లబ్ధిదారుల వివరాలు, బిల్లులు

జిల్లా	గృహాలు	పెండింగ్ బిల్లులు రూ.కోట్లలో
చిత్తూరు	29,093	47.19
తిరుపతి	23,484	39.06

చిత్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేసిన కక్షపూరిత రాజకీయాలకు గృహ నిర్మాణ లబ్ధిదారులు కూడా బాధితులయ్యారు. 2014-19 హయాంలో నాటి టీడీపీ ప్రభుత్వం పేదల కోసం 2016లో గృహ నిర్మాణ పథకాన్ని ప్రారంభించింది. పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయగా, 2019 ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా కొన్ని బిల్లులు మంజూరవలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా టీడీపీ హయాంలో నిర్మించుకున్నవారికి బిల్లులు ఆపేసింది. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు, వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఆపేయడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, అప్పట్లో నిర్మించుకుని బిల్లులు పొందని లబ్ధిదారుల్ని గుర్తించేందుకు సర్వే చేసింది. జిల్లాలోనూ హౌసింగ్ అధికారులు అక్టోబరులో క్షేత్రస్థాయి సర్వే మొదలుపెట్టి తాజాగా పూర్తి చేశారు. వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. త్వరలో బిల్లులు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ కానున్నాయి. దీంతో అప్పటి లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

చిత్తూరు జిల్లాలో 29,093 మంది లబ్ధిదారులకు రూ.47.19 కోట్లు, తిరుపతి జిల్లాలో 23,484 మంది లబ్ధిదారులకు రూ.39.06 కోట్లను వైసీపీ ప్రభుత్వం నిలిపేసిందని తాజాగా చేసిన సర్వేలో తేలింది. ఈ వివరాలను జిల్లా హౌసింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇక వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు 72,272 గృహాలు మంజూరైతే యూనిట్ కాస్ట్ తక్కువగా ఉండడం, గుట్టల్లో ఇచ్చిన లేఅవుట్లు ఇంటి నిర్మాణానికి అనుగుణంగా లేకపోవడంతో సగం కూడా నిర్మాణాలు పూర్తికాలేదు.

త్వరలో బిల్లులు

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా అప్పట్లో మంజూరైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో సర్వే చేసి గుర్తించాం. ప్రభుత్వానికి నివేదిక అందించాం. జిల్లాలో సుమారు రూ.47 కోట్ల బకాయి బిల్లులు రావాల్సి ఉంది. వీరందరికీ త్వరలోనే నేరుగా వారి ఖాతాల్లోకి బిల్లులు పడే అవకాశం ఉంది.

- పద్మనాభం, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి



తిరుమలలో వైకుంఠ శోభ

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల వెంకటేశ్వర ఆలయం ఉత్తరద్వార దర్శనానికి సిద్ధమైంది. ఇందుకోసం సర్వాంగ సుందరంగా ఆలయాన్ని అలంకరించారు. గురువారం అర్ధరాత్రి దాటాక వైకుంఠనాథుడి దర్శనానికి ఆలయ ద్వారాలు తెరిచారు. శుక్రవారం తెల్లవారుజామున ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించాక భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

- వివరాలు 4లో -



తిరుమలలో వైకుంఠ శోభ

● నేటి నుంచి పదిరోజుల ఉత్తరద్వార దర్శనాలు ● సుందరంగా ముస్తాబైన శ్రీనివాసుని ఆలయం

తిరుమల, జనవరి9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల క్షేత్రం ఉత్తరద్వార దర్శనాలకు సిద్ధమైంది. పదిరోజుల పాటు జరిగే వేడుకకు శోభాయమానంగా ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈనెల 19 వరకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి దర్శనం కల్పించనున్నారు. ఈక్రమంలో ఆలయాన్ని శోభాయమానం తీర్చిదిద్దారు. ఐదు టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరించారు. వైకుంఠద్వారం, బలిపీఠం, ధ్వజస్తంభం వంటి ప్రాంతాలను 1.40 కట్‌ఫ్లవర్స్‌తో అలంకరించారు. ఆలయం వెలుపల ఐదు టన్నుల పుష్పాలను అలంకరణకు వినియోగించారు. వాహన మండపం సమీపంలో 'శ్రీరంగనాథమండపం' సిద్ధం చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పుష్పాలతో రంగనాథస్వామి ఆలయ సెట్టింగ్ వేశారు.

తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

గురువారం అర్ధరాత్రి శ్రీవారి ఆలయంలోని వైకుంఠద్వారాలు తెరుచుకున్నాయి. 12.05 గంటల సమయంలో తలుపులు తెరిచిన అర్చకులు శుక్రవారం వేకువజాము ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించారు. 4.30 వీఐపీ దర్శనాలను కల్పించనున్నారు. టోకెట్లు, టికెట్లు పొందిన భక్తులను గురువారం అర్థరాత్రి12 గంటల నుంచి క్యూకాంప్లెక్స్‌లోకి అనుమతించారు. వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 8 గంటలకు ముగియనున్నాయి. తర్వాత సర్వదర్శనాలను ప్రారంభించనున్నారు.

టోకెన్ ఉన్నవారికే ఎంట్రీ, వసతి

టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులను గురువారం రాత్రి నుంచి కంపార్టుమెంట్లలోకి అనుమతించారు. వారికే గదులను కేటాయించారు. టికెట్లు లేనివారు గదులు లేక షెడ్లు, పార్కులు, కార్యాలయాల ముందు, వసతి సముదాయాల్లో, ఫుట్‌పాత్‌లపైనే సేదతీరాల్సి వచ్చింది. చలికి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేకదర్శనాలన్నీ రద్దు

ఈపదిరోజులకు సంబంధించి ఇప్పటికే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు 1.40 లక్షలు, శ్రీవాణి టికెట్లు 19,500 జారీ చేశారు. తొలిమూడురోజులకు సామాన్య భక్తులకు స్లాటెడ్ సర్వదర్శనానికి సంబంధించి 1.20 లక్షల టోకెన్లను జారీ చేసింది. తర్వాత రోజులకు ఏరోజుకారోజు విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల ద్వారా జారీ చేయనున్నారు. పదిరోజుల్లో వీఐపీ బ్రేక్‌కు సిఫార్సులు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు వంటి ప్రత్యేకదర్శనాలు ఉండవు. శ్రీవారిమెట్టు మార్గంలోనూ దివ్యదర్శన టోకెన్ జారీ ఉండదు.



వీఐపీలకు చేసిన ఏర్పాట్లు

వీఐపీల పర్యటన నేపథ్యంలో తిరుమలలో 12 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశారు. ఎంబీసీ, ఔటర్‌రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వీఐపీలకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు నాలుగు కేంద్రాల్లో జరిగాయి. వెంకటకళ అతిథిగృహంలోని కౌంటర్‌లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు, న్యాయమూర్తులు, మంత్రులు, విప్‌లు, స్పీకర్లకు టికెట్లను జారీ చేశారు. సన్నిధానం కౌంటర్‌లో టీటీడీ బోర్డు ఛైర్మన్, బోర్డు సభ్యులు, వారి సిఫార్సులపై టికెట్లు కేటాయించారు. నారాయణగిరి-4 కౌంటర్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు టికెట్లను జారీ చేశారు. వకుళమాత విశ్రాంతి భవనం కౌంటర్ ద్వారా ఆలిండియా సర్వీస్ అధికారులకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు జరిగింది.

నేడు స్వర్ణరథోత్సవం

శుక్రవారంఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు వాహనమండపంలో శ్రీమలయప్పస్వామి దర్శనం ఉంటుందన్నారు. శనివారం ద్వాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము 5.30 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన కార్యక్రమం జరుగుతుంది.



ఘటనపై రెండు కేసులు



మార్చురీలో మృతదేహాలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు భక్తుల మృతిపై డీఎస్పీ వెంకటనారాయణ ఆదేశాలతో సీఐ రామకృష్ణ రెండు వేర్వేరు ఎఫ్ఆర్ఐలు నమోదు చేశారు. బుధవారం రాత్రి తిరుపతిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన మెట్టూరువాసి ఆర్.మల్లిక.. విష్ణునివాసం వద్ద దర్శన టోకెన్ల కోసం క్యూలో నిలబడి అక్కడ జరిగిన తొక్కిసలాటలో స్పృహతప్పి పడిపోయిందని బాలాయపల్లి తహసీల్దార్ పి.శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. ఇది మొదటి కేసుగా పోలీసులు తెలిపారు. మల్లికను రుయాకు తీసుకెళుతుండగా, ఆస్పత్రికి వెళ్లేలోగా మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన మేరకు ఆ సమయంలో ఇతర భక్తులు క్యూలైన్ వైపు పరుగెత్తడంతో ఆమె అనారోగ్యం కారణంగా నేలపై పడిందని తెలిపారు. వీరితోపాటు బైరాగిపట్టెడ పార్కు వద్ద మృతి చెందిన ఐదుగురికి సంబంధించి నారాయణవనం తహసీల్దార్ ఎం.జయరాములు ఇచ్చిన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన కందిపల్లి శాంతి, గుడ్ల రజని, బొడ్డేటి నాయుడు బాబు, సూరిశెట్టి లావణ్య స్వాతి, తమిళనాడుకు చెందిన నిర్మల మృతి చెందినట్లు ఫిర్యాదులో తెలిపారు. రామానాయుడు పార్కు వద్ద దర్శనం టికెట్ల కోసం వేచి ఉండగా క్యూలో ఒక్కసారిగా తోపులాట జరిగి కిందపడ్డారని తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిని రుయాకు తరలించగా.. ఈ ఐదుగురు కూడా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ రెండు కేసులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలకు బాధ్యులెవరు? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. బంధువులు, కుటుంబీకుల నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్లు నమోదు చేశారు.

ప్రత్యక్ష సాక్షుల కథనాలు

గోవిందా..గోవిందా అంటూ...

నేను టోకెన్ల కోసం వచ్చి 8.10-8.25గంటలమధ్య ముందువరుసలోనే ఉన్నాను. గోవిందా.. గోవిందా అంటూ నా వెనుకనుంచి బలవంతంగా తోయడంతో కిందపడిపోయాను. దీంతో ఊపిరి ఆడలేదు. ఎలాగో పైకి లేచి నిల్చుని ఊపిరి పీల్చుకున్నాను. తొక్కిసలాట జరిగింది. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైక్‌సెట్‌లో పలుమార్లు అనౌన్స్ చేశారు. అక్కడున్న వారిలో చాలామంది తెలుగువాళ్లు కాదు. తమిళం, కన్నడ మాట్లాడుతున్నారు. వాళ్లకు అర్థం కాలేదు. కొంతమంది కదిరి, పులివెందుల ప్రాంతాల నుంచి వచ్చినట్టు వాళ్ల యాసను బట్టి అర్థం అయ్యింది. ఒక ఉప్పెనలా ముందుకు రావడంతో అంతా గందరగోళం అయిపోయింది. రెండుగేట్లు ఓపెన్ అయిపోయాయి. పోలీసులు ఎంతప్రయత్నించినా నిలువరించలేకపోయారు. భక్తులు కిందపడిపోయారని పోలీసులు చెబుతున్నా వినకుండా ఫోర్స్‌గా తోసుకుంటూ వచ్చారు.

- సుదర్శన్‌రెడ్డి, కడప



పోలీసులు అరుస్తున్నా..

తిరుపతి రూరల్ మండలం అవిలాల మాది. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో అటువైపు వెళ్లాను. పార్క్‌లో చిన్నపిల్లలు, వృద్ధులు, భక్తులు ఎక్కువసంఖ్యలో కనిపించారు. తిరిగిరాత్రి 8.20గంటలప్రాంతంలో ఈమార్గంలో వెళ్తూ అటు చూశాను. వేలాదిమంది టోకెన్లకోసం పార్క్‌లో గుమికూడా ఉన్నారు. ఒకరినొకరు తోసుకుంటూ ఉన్నారు. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైక్‌సెట్‌లో చెబుతున్నారు. ఈలోపే తొక్కిసలాట జరిగింది.

- లక్ష్మణ్, అవిలాల

అంతా గేటు ముందే!



మధ్యాహ్నం నుంచి భక్తులరాక బాగా పెరిగింది. వచ్చినవారందరూ గేటుముందు భాగంలోకి వచ్చి తోసుకుంటూ ఉన్నారు. వెనుక భాగమంతా ఖాళీగానే ఉంది. పోలీసులు వెనుకకు జరగండని అనౌన్స్‌మెంట్ చేశారు. తీరా గేట్లు తెరచీతెరవముందే భక్తులు దూసుకువచ్చారు. దీంతో తోపులాట జరిగింది. ఘోరం జరిగిపోయింది.

- రాకేష్, స్థానిక దుకాణం వ్యక్తి

స్పెషల్ ఫ్లైట్లతో కిటకిటలాడిన ఎయిర్‌పోర్ట్

రేణిగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన పెను విషాదం, వైకుంఠ ఏకాదశి పర్వదినం వెరసి వీఐపీల తాకిడితో విమానాశ్రయం గురువారం కిటకిటలాడింది. బాధితులను పరామర్శించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్ వేర్వేరుగా తిరుపతి పర్యటనకు వచ్చారు. సీఎం మధ్యాహ్నం 1.20గంటలకు వచ్చి రాత్రి ఎనిమిది గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3.30గంటలకు వచ్చి రాత్రి 8.25గంటలకు బయల్దేరారు. మాజీ సీఎం జగన్ సాయంత్రం 5.30 గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. వీరంతా ప్రత్యేక విమానంలో వచ్చారు. మరోవైపు తిరుమలేశుడి వైకుంఠ ద్వార దర్శనం కోసం కేంద్ర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1.30గంటలకు వచ్చారు. తర్వాత తిరుచానూరులో జరిగే ప్రైవేటు కార్యక్రమాలకు వెళ్లారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇండిగో విమానంలో కుటుంబీకులతో కలిసి మధ్యాహ్నం 1.10గంటలకు వచ్చారు. తర్వాత తిరుమలకు బయల్దేరి వెళ్లారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ.. ఇండిగో విమానంలో ఉదయం 10.50గంటలకు వచ్చారు. తిరుపతి, రాజంపేటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని, 11వ తేదీన శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి.. ఇండిగో విమానంలో సాయంత్రం 4 గంటలకు వచ్చారు. తర్వాత రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి తెల్లవారుజామున 4.55 గంటలకు విమానాశ్రయం చేరుకుని, తిరుమలకు వెళ్లారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరుమలేశుడి దర్శనార్థం విశాఖపట్నం నుంచి వచ్చారు. ఇలా వచ్చిన వీఐపీలతోపాటు వారికి స్వాగతం పలకడానికి వచ్చిన వారితో తిరుపతి విమానాశ్రయం కిక్కిసింది. ఇక శుక్రవారంనుంచి వైకుంఠ ద్వార దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు రానున్నారు.



టీటీడీ పరిపాలనా భవనంలో మంత్రులు, అధికారులతో సీఎం మీడియా సమావేశం

టీటీడీ చరిత్రలో చీకటి రోజు

ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరం. టీటీడీ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా నిలిచిపోతుంది. అధికారుల వైఫల్యమే దీనికి ప్రధాన కారణం. మృతుల కుటుంబీకులకు టీటీడీ, ప్రభుత్వం అండగా నిలుస్తుంది. గాయపడిన ప్రతీ ఒక్కరు కూడా స్వామివారిపై ఉన్న భక్తితో తమకు దర్శన భాగ్యం కల్పించండి అని కోరుతున్నారు. వారి కోరిక మేరకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించి, సురక్షితంగా స్వగ్రామాలకు పంపే ఏర్పాటు చేస్తాం.

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

ఇలాంటి ఘటన దురదృష్టకరం

ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం. అంచనాలకు మించి భక్తులు అధిక సంఖ్యలో రావడం, వారిని అదుపు చేయలేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగింది. ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఏమాత్రం ఉందనేది విచారణలో తేలుతుంది. బాధ్యతారహితంగా వ్యవహరించిన వారికి శిక్ష తప్పదు. అలాగే బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది.

- టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి

టీటీడీ వైఫల్యం ఏమీ లేదు

శ్రీవారి భక్తులకు ఈ విధంగా జరగడం చాలా బాధాకరం. వైకుంఠ దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం టీటీడీ అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసింది. అయినప్పటికీ ఊహించని రీతిలో భక్తులు రావడం, వారు దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసి ఉండటం వల్ల సక్రమంగా ఆహారం లేక నీరసించి కిందపడి పోవడంతో తొక్కిసలాట జరిగింది. ఇందులో టీటీడీ వైఫల్యం ఏమీ లేదు.

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

సాధారణ భక్తులకు ప్రాధాన్యం లేకనే..

టీటీడీలో వీఐపీలకు తప్ప సాధారణ భక్తులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అందువల్లే సాధారణ భక్తుల విషయంలో టీటీడీ, పోలీసుల సమన్వయం లేక ఇటువంటి దురదృష్టకర ఘటన జరిగింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మృతుల కుటుంబాలను, బాధితులను టీటీడీ, ప్రభుత్వం ఆదుకోవాలి.

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శవ రాజకీయాలు చేస్తే సహించేది లేదు

వైసీపీ నేతలు వారు చేసిన తప్పులను మరిచి జరిగిన దురదృష్టకర ఘటనను అడ్డం పెట్టుకొని శవ రాజకీయాలు చేసేందుకు తెర లేపుతున్నారు. ప్రధానంగా టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి.. టీటీడీని, ప్రభుత్వాన్ని నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. బాధితులను పరామర్శించి.. అండగా ఉండాలే కానీ, తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదు.

- తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్

టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే!

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఘటనకు టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నెలరోజులుగా వైకుంఠ ఏకాదశి పేరుతో సమీక్షలు నిర్వహించారే తప్పా ఆచరణలో తగిన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. టీటీడీలో పనిచేసే వారు తక్కువయ్యారని పర్యవేక్షించేవారు ఎక్కువ అయ్యారని అన్నారు. దర్శనాలకు సంబంధించిన అంశం పూర్తిగా తిరుమల అడిషనల్ ఈవో వెంకన్న చైదరికి సంబంధించిందని ఆయనకు చంద్రబాబు సేవ తప్ప భక్తుల సేవ కనబడటంలేదని విమర్శించారు. ఈ ఘటనలో అడిషన్ ఈవో వెంకన్నచౌదరితో పాటు ఎస్పీ, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని, ఈవోను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానని చెప్పిన పవనానంద స్వామి దీనిపై మాట్లాడాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మోహిత్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, పక్కన మేయర్ శిరీష, మోహిత్‌రెడ్డి

వీవీఐపీల రాకతో ఒత్తిడికి గురైన యంత్రాంగం



అధికారులతో చంద్రబాబు

తిరుపతిలో బుధవారం తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఇప్పటికే తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న జిల్లా యంత్రాంగంపై గురువారం వీవీఐపీల వరుస పర్యటనలు మరింత ఒత్తిడి పెంచాయి. దాంతో అధికారులు సతమతమయ్యారు. బుధవారం తిరుపతిలోని బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన దుర్ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు బుధవారం రాత్రే అధికారులపై మండిపడ్డారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపడం, సీఎం చంద్రబాబు సీరియస్ కావడంతో జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు ఆందోళనకు గురయ్యారు. పర్యవసానాలు ఎలా వుంటాయోనని వారిలో గుబులు మొదలైంది. అదే సమయంలో గురువారం తిరుపతి వస్తానని సీఎం ప్రకటించడంతో అధికారులను టెన్షన్ చుట్టుముట్టింది. సీఎం ఏమి చూస్తారో, ఏమి అడుగుతారో, ఏం చేస్తారోనని భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం వేకువజామున తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరవనున్న సంగతి తెలిసిందే. వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వీవీఐపీలు వస్తుండడంతో వారికి రవాణా, బస, దర్శనాలు ఏర్పాటు చేయడంలో అటు జిల్లా యంత్రాంగం, ఇటు టీటీడీ యంత్రాంగం కూడా తలమునకలవుతున్నాయి. ఆ సమయంలో తొక్కిసలాట ఘటన జరగడం, సీఎం గురువారం పర్యటన తలపెట్టడం అధికారులకు ఊపిరి సలపకుండా చేశాయి. గురువారం ఉదయాన్నే ఏకంగా ఆరుగురు మంత్రులు తిరుపతిలో దిగారు. జిల్లా ఇంఛార్జి మంత్రి హోదాలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామా నాయుడు, హసింగ్ మంత్రి కొలుసు పార్థసారధి, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు బృందంగా ఏర్పడి రుయా, స్విమ్స్ ఆస్పత్రులు సందర్శించారు. వారికి కాన్వాయ్‌లు, పోలీసు ఎస్కార్ట్, వెంట అధికారులను నియమించాల్సి వచ్చింది. బస ఇతర ఏర్పాట్లు కూడా చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి సీఎం చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచీ తిరుపతి వచ్చారు. సీఎం కోసం కాన్వాయ్, భారీ భద్రత కల్పించారు. వెంట జిల్లా అధికారులు మొత్తం వుండాల్సి వచ్చింది. బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద బహిరంగంగానే ఆయన కలెక్టర్, టీటీడీ ఈవో, ఎస్పీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామం అధికారులను తీవ్ర ఒత్తిడికి లోను చేసింది. సీఎం స్విమ్స్ పద్మావతి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించడం, టీటీడీ పరిపాలన భవనం చేరుకుని అధికారులతో సమీక్షించడం చేశారు. సమీక్షలోనూ అధికారుల తీరుపై మండిపడినట్టు సమాచారం. దానికి తగ్గట్టే ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు, మరో ముగ్గురిపై బదిలీ వేటు పడింది. ఈ పరిణామం అధికారులను మరింత ఇరుకున పడేసింది. సీఎం పర్యటన సాగుతుండగానే సమాంతరంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుపతి చేరుకున్నారు. ఆయనకు కాన్వాయ్, భారీ భద్రత, వెంట అధికార యంత్రాంగం వుండాల్సి వచ్చింది. ఆయన కూడా బైరాగిపట్టెడ వెళ్లి అక్కడ నుంచీ స్విమ్స్ వచ్చారు. ప్రజాకర్షణ కలిగిన నేత కావడంతో భారీగా భద్రత కల్పించాల్సి వచ్చింది. ఈ ఇద్దరూ తిరుపతిలో పర్యటిస్తుండగానే ఇంకోవైపు మాజీ సీఎం జగన్ కూడా తిరుపతి వచ్చారు. ఇలా వీవీఐపీలు ఏకకాలంలో తిరుపతి చేరుకుని పర్యటించడంతో అధికార యంత్రాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బైరాగిపట్టెడ పార్కులో పవన్



ఆసుపత్రి వద్ద జగన్

శవ రాజకీయాలు మానుకో భూమనా !

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వార దర్శన టికెట్స్ కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న భక్తులను ఆయన గురువారం పరామర్శించారు. మీడియాతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదన్న సంగతి ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను విమర్శించే స్థాయి కరుణాకరరెడ్డికి లేదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజారెడ్డి, బీజేపీ నేతలు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, నరసింహ యాదవ్

మృతుల కుటుంబాలకు బీసీవై పార్టీ ఆర్థిక సహాయం

పుంగనూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జరిగిన ఘటనలో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు బీసీవైపార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం ఆయన తిరుపతి చేరుకుని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ ఘటనకు టీటీడీ ఛైర్మన్, ఈవో, అధికారులు బాధ్యులన్నారు. వెంటనే బోర్డును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ విధానాలనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొనసాగించడం వల్ల ఇలాంటి ఇబ్బందులు వస్తున్నట్లు ఆరోపించారు.



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న రామచంద్ర యాదవ్

ఆ ఇద్దరితో సీఎం ఏం మాట్లాడారు?

కలెక్టర్, ఎస్పీతో బస్సులో సీఎం 20 నిమిషాల సంభాషణపై అధికార వర్గాల్లో ఆసక్తి

చిత్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన చివరి రోజు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠలతో సుమారు 20 నిమిషాలపాటు విడిగా మాట్లాడిన అంశం అధికారవర్గాల్లో చర్చగా మారింది. సోమ, మంగళవారాలు నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం.. మంగళవారం రాత్రి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లోని బస్సులోనే బస చేసి బుధవారం మధ్యాహ్నం వైజాగ్ వెళ్లారు. ఈ క్రమంలో ఉదయం కలెక్టర్, ఎస్పీలతో సీఎం బస్సులోనే సుమారు 20 నిమిషాలపాటు మాట్లాడారు. లోపల ఏం మాట్లాడారు.. అనే చర్చ అధికార వర్గాల్లో నడుస్తోంది. ఎన్నికల సమయంలో జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మణికంఠ మీద సదభిప్రాయం ఉండడంతో కూటమి ప్రభుత్వం ఆయన్ను కొనసాగిస్తోంది. అయితే కొందరు ప్రజాప్రతినిధులు ఆయన తీరుపై సీఎం వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రత్యేక భేటీపై అందరిలో ఆసక్తి నెలకొంది.

బోయకొండ గంగమ్మ హుండీ ఆదాయం రూ.58లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ.58 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. రూ.58,68,134, 18 గ్రాముల బంగారు, 420 గ్రాములు వెండి, కువైట్ ఒక దీనార్ 4 నోట్లు, 5 దీనార్ నోటు ఒకటి, యూఏఈ 5, 10 దిరమ్ నోట్లు ఒక్కొక్కటి, 100 దిరమ్ 2 నోట్లను 42 రోజులలో భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా సమర్పించారన్నారు. అలాగే రణబేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.33,188 వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని ఐసీఐసీఐ బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పారా క్రీడా పోటీలు



షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి

చిత్తూరు క్రీడలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మెసానికల్ మైదానంలో గురువారం జిల్లా స్థాయి పారా క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్‌డీవో బాలాజి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా పతకాలు సాధించి జిల్లాకి మంచి పేరు తేవాలన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో షాట్‌పుట్, జావెలిన్‌త్రో, 100 మీటర్ల పరుగుపోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈనెల 31వ తేదీన విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన విచారణ

చిత్తూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పూర్వపు కమిషనర్ అరుణ అవినీతి, అక్రమాలపై జరుగుతున్న విచారణ రెండో రోజైన గురువారం కూడా కొనసాగింది. అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విశ్వనాథ్ నేతృత్వంలోని విచారణ బృందం నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలకు చెందిన రికార్డులను తెపించుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. మరో రెండ్రోజులపాటు విచారణ జరుగుతుందని, తుది నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని ఆర్డీ తెలిపారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా చెన్నయ్య

చిత్తూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమశాఖ, సాధికారిత అధికారిగా చెన్నయ్యను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేస్తుండిన రాజ్యలక్ష్మి.. కడప జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీపై వెళ్లారు. తిరుపతిలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా పనిచేస్తున్న చెన్నయ్యను డిప్యూటేషన్‌పై జిల్లాకు బదిలీ చేశారు. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతోపాటు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా కూడా వ్యవహరించనున్నారు.

పలమనేరు ఎస్‌టీవో సస్పెన్షన్

పలమనేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగినికి జీతభత్యాలకు సంబంధించిన బిల్లు రెండు పర్యాయాలు చెల్లింపులు జరిగినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. జిల్లా ట్రెజరీ అధికారులు రాష్ట్ర ట్రెజరీ అధికారులకు నివేదిక పంపడంతో ట్రెజరీ డైరెక్టర్ పలమనేరు సబ్ ట్రెజరీ అధికారి మునికృష్ణతో పాటు సీనియర్ అసిస్టెంట్ నజీర్‌ను సస్పెండ్ చేశారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన అప్పలాయగుంట

వడమాలపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా అప్పలాయగుంట లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆగమశాస్త్రం ప్రకారంగా తాత్కలికంగా వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున శుక్రవారం వైకుంఠ నాథుడైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వేలాదిగా తరలి వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు కల్పించినట్టు అధికారులు తెలిపారు. . ప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అప్పలాయగుంట పొలిమేరల్లోనే పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి భక్తులకు ఇబ్బంది కలుగకుండా టీటీడీ ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం 12.05 గంటలకు తిరుప్పావై పాశురాల పఠనం అనంతరం ఉదయం 3.30 గంటలనుంచి రాత్రి 8 గంటలకు వరకు భక్తులు సర్వదర్శనం కల్పిస్తున్నారు. శనివారం ద్వాదశి రోజుల శనివారం ఉదయం 6.30-7.00 గంటల మధ్య శ్రీవారి చక్రస్నానం ఆలయంలోనే ఏకాంతంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలపారు.



ద్రావిడ యూనివర్సిటీ - వేమన భవన్‌పై ఉన్న సోలార్ ప్యానళ్లు - బాయ్స్ హాస్టల్‌పై..

ద్రావిడకు 'సౌర'భాలు

నెలకు 26వేల యూనిట్ల ఉత్పత్తి ● 8 ఏళ్లుగా నెలకు రూ.43వేల ఆదా ● తాజాగా వాటర్ హీటర్లకూ సోలార్ విధానమే అమలు

ఇటీవల కుప్పంలో పర్యటించిన సీఎం చంద్రబాబు నడిమూరులో పైలెట్ ప్రాజెక్టుగా సోలరైజేషన్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో రాష్ట్రమంతటా దీన్ని అమలుచేసి.. ప్రజలకు విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం. దీంతోపాటు గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2017లోనే ఇక్కడి ద్రావిడ యూనివర్సిటీలో సోలార్ ప్లాంట్స్ అమర్చేలా చంద్రబాబు చొరవ తీసుకున్నారు. ఇప్పుడది సత్ఫలితాలను ఇస్తోంది. దీంతో యూనివర్సిటీ అధికారులు తాజాగా మరిన్ని సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చిత్తూరులోని ప్రభుత్వ సంస్థ నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన రిచ్ ఫైటోకేర్ కంపెనీ వారు 2017లోనే ద్రావిడ యూనివర్సిటీలో రూ.2.66కోట్లతో సోలార్ ప్లాంట్స్ అమర్చారు. 446 కిలోవాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన దీన్ని 25 ఏళ్లపాటు అగ్రిమెంటు చేసుకున్నారు. వర్సిటీకి ఎలాంటి ఖర్చూ లేదు. అగ్రిమెంట్ పూర్తయ్యాక మొత్తం ప్లాంట్‌ను వర్సిటీకి వదిలేసి వెళ్లిపోతారు. 25 ఏళ్ల పాటు నిర్వహణ కూడా కంపెనీ వాళ్లే చూసుకుంటున్నారు. వర్సిటీలో ఇటీవల నిర్మించిన కొత్త భవనాల్లో కూడా ప్లాంట్స్ అమర్చుతామని కంపెనీ వాళ్లు ముందుకొచ్చారు. చర్చలు నడుస్తున్నాయి. వర్సిటీలోని గెస్ట్‌హౌస్, లైబ్రరీ, వేమన భవన్, తిరువళ్లువార్ భవన్, నారాయణగురు భవన్, బసవ భవన్‌ల మీద 65 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం చొప్పున ప్లాంట్స్ అమర్చగా.. ఆడిటోరియం మీద 56 కేడబ్ల్యూహెచ్ ప్లాంట్స్ ఏర్పాటు చేశారు. ఇలా మొత్తం కలిపి 446 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యంతో ప్లాంట్లు పని చేస్తున్నాయి.

● ఇప్పటికే రూ.40 లక్షల ఆదా..

ఈ ప్లాంట్లు ద్వారా నెలకు 26వేల యూనిట్ల కరెంటు ఉత్పత్తి అవుతోంది. అక్కడి ప్రభుత్వ విద్యుత్తు సంస్థ రెస్కో.. ఓ యూనిట్‌కు రూ.8 వసూలు చేస్తుండగా.. సోలార్ ఏర్పాటు చేయడంతో యూనిట్ మీద రూ.1.60 తగ్గింది. అంటే సోలార్ ఏర్పాటు చేసిన ప్రైవేటు కంపెనీకి వర్సిటీ అధికారులు యూనిట్‌కు రూ.6.40 చొప్పున మాత్రమే కరెంటు బిల్లును చెల్లిస్తున్నారు. దీని ద్వారా వర్సిటీకి నెలకు రూ.43 వేల ఆదా అవుతుండగా.. ఏడాదికి రూ.5.16 లక్షలు మిగులుతోంది. ఇలా ఇప్పటివరకు 8 ఏళ్లలో మొత్తం రూ.40 లక్షలకుపైగా మిగిలింది.



ఆడిటోరియం భవనంపై..

● రూసా నిధులతో మరిన్ని ఏర్పాటు

ప్రైవేటు కంపెనీ వాళ్లు అమర్చిన సోలార్ ప్లాంట్స్‌తో పాటు గతేడాది డిసెంబరులో వర్సిటీ అధికారులు కూడా సోలార్ వాటర్ హీటర్లను అమర్చారు. మెన్స్ హాస్టల్, ఉమెన్స్ హాస్టల్, గెస్ట్‌హౌస్, వీసీ బంగ్లా, రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్‌లో సోలార్ వాటర్ హీటర్స్ అమర్చారు. హైదరాబాద్‌కు చెందిన బిగ్ జీ సోలార్ సొల్యూషన్ కంపెనీతో మాట్లాడి వీటిని ఏర్పాటు చేశారు. ఐదు బిల్డింగులకు రూ.10 లక్షల ఖర్చవ్వగా.. రూసా నిధుల్ని కేటాయించారు. ఒక్కో బిల్డింగుకు రోజుకు 20 యూనిట్ల చొప్పున ఐదు బిల్డింగులకు వంద యూనిట్లు మిగులుతోంది. నెలకు రూ.20వేల కరెంటు బిల్లు మిగులుతోంది. ఏడాది రూ.2.40 లక్షలు మిగిలినట్లు. నాలుగేళ్లలో పెట్టుబడి వెనక్కి వచ్చేస్తుందని అధికారులు చెప్తున్నారు.

బిల్లు తగ్గడంతోపాటు అనేక ప్రయోజనాలు

సోలార్ పవర్ ప్లాంట్లతో విద్యుత్తు బిల్లు తగ్గడంతో పాటు అనేక పర్యావరణ ప్రయోజనాలున్నాయి. వర్సిటీలో ఏర్పాటుచేసిన 446 కేడబ్ల్యూహెచ్ సోలార్ ప్లాంట్ ద్వారా ఏడాదికి 545 టన్నుల కార్బన్ డైయాక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుందని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు. కార్బన్ డైయాక్సైడ్ తగ్గడమంటే చెట్ల అభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడినట్లే అంటున్నారు. సోలార్ ప్లాంట్ల నిర్వహణకు, శక్తి ఉత్పత్తికి నీళ్ల అవసరం ఉండదు కాబట్టి నీరు ఆదా అయినట్లేనని నిపుణులు భావిస్తున్నారు. ఒక్కసారి అమర్చితే ఎలాంటి నిర్వహణ లేకుండా 25-30 ఏళ్ల కంటే ఎక్కువ కాలం మన్నిక వస్తాయి.

'డైట్'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



బోనాలు వండుతున్న ప్రిన్సిపాల్ శేఖర్ తదితరులు - గొబ్బిళ్లు తడుతున్న ఛాత్రోపాధ్యాయులు

వెదురుకుప్పం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలను ముందస్తుగా గురువారం కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు జరుపుకున్నారు. డైట్ ఆవరణను మామిడి ఆకుల తోరణాలు, చెరకు గడలు, పూలదండలు, గాలిపటాలు, ముగ్గులతో సుందరీకరించారు. గోపూజ చేశారు. బోనాలు వండి అమ్మవారికి నైవేద్యంపెట్టారు. భోగి మంటలు వేశారు. గొబ్బిళ్లు తట్టారు. కోలాటాలు, కర్రసాము, బొంగరం తదితర ఆటలను ఆడారు. ఈ క్రమంలో ఛాత్రోపాధ్యాయిని ఒకరు ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్‌కి 'సోది' చెప్పడం ఆకట్టుకుంది. కార్వేటినగరం డైట్‌లో ముందే సంక్రాంతి పండుగ వాతావరణం ఏర్పడింది. సంప్రదాయ దుస్తులతో రావడం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు దేవప్రసాద్, చెంగల్రాజు, రెడ్డి వెంకటరమణ, నాగరాజు నాయక్, శ్రీనివాసులు, ప్రభాకర్, నిర్మల, సునీత, అనిత తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటలు

బడులకు నేటినుంచి సంక్రాంతి సెలవులు

● ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు : డీఈవో

చిత్తూరు సెంట్రల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం తన చాంబర్ నుంచి డీవైఈవో, ఎంఈవో, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలకు సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఆర్‌పీ, సచివాలయ ఫీల్డు అసిస్టెంట్లు ఫీల్డ్ విజిట్ చేయాలన్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా వచ్చిన షార్టేజ్ పనిదినాలపై తరగతులను ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలోని 1042 మంది ఇప్పటివరకు టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో వివరాలు నమోదు చేయలేదన్నారు. వెంటనే వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. సీనియారిటీ, పదోన్నతులు ఇతర ప్రయోజనాలకు ఈ సమాచారం ఉపయోగకరంగా ఉంటుందని టీచర్లకు సూచించారు.

విద్యార్థులకు సకాలంలో కిట్లు అందిస్తాం

● ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు సెంట్రల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో కిట్లు అందించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం తన చాంబర్‌లో సెక్టోరియల్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. విద్యార్థులకు అందజేసే కిట్‌లో భాగంగా ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1.62 లక్షల మంది విద్యార్థుల షూ కొలతలు ఖచ్చితంగా తీసుకున్నట్లు చెప్పారు. సంక్రాంతి సెలవుల యాక సెక్టోరియల్స్ ప్రతి పాఠశాలను విజిట్ చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. శాఖలోని వాహనాలను అవసరం మేరకే వినియోగించాలని హెచ్చరించారు. సంక్రాంతి సెలవుల తర్వాత టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణపై దృష్టి సారించడంతోపాటు ప్రతి సెక్టోరియల్.. ప్రార్థనా సమయంలో ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేసి, సమాచారం ఇవ్వాలన్నారు. సూపరింటెండెంట్ కుమార్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

తిరుపతి-హైదరాబాదు మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే హైదరాబాదు-తిరుపతి మధ్య మరో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు.

● హైదరాబాదు నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు (07211) 12వ తేదీ రాత్రి 9.45 గంటలకు బయలుదేరి సికింద్రాబాదు, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా మరుసటి రోజు ఉదయం 10.25 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.

● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07212) ఈనెల 13వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 7.50 గంటలకు హైదరాబాదు చేరుకుంటుంది.

పద్మావతీ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు ఏసీ కోచ్‌లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 13న సికింద్రాబాదు నుంచి బయలు దేరనున్న పద్మావతీ ఎక్స్‌ప్రెస్ రైలుకు (12764) 2ఏసీతో పాటు 3ఏసీ కోచ్‌ను అదనంగా ఏర్పాటు చేసినట్లు సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు.

పోటాపోటీగా అంతర కళాశాల క్రీడా పోటీలు

ఓవరాల్ చాంప్‌గా ఆతిథ్య ఎస్వీ వెటర్నరీ కళాశాల





క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా నిర్వహించే 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు గురువారం పోటాపోటీగా సాగాయి. విజేతల వివరాలను ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ జయచంద్ర వెల్లడించారు. పురుషుల వాలీబాల్, మహిళ బాస్కెట్‌బాల్, పురుషుల షటిల్ బ్యాడ్మింటన్, మహిళల టెన్నికాయిట్, పురుషుల బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్‌లో ఆతిథ్య తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలచి ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. పురుషుల బాస్కెట్‌బాల్‌లో గన్నవరం ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, మహిళల బాల్‌బ్యాడ్మింటన్‌లో గరివిడి వెటర్నరీ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. పురుషుల 800మీటర్ల రన్నింగ్ పోటీలలో రాజేష్, మహిళ విభాగంలో ఎన్.ప్రణీత(గరివిడి వెటర్నరీ కాలేజ్), 1500మీటర్ల పురుషుల రన్నింగ్‌లో వై.దుర్గాప్రసాద్, మహిళల విభాగంలో కె.త్రివేణి (తిరుపతి వెటర్నరీ, డెయిరీటెక్నాలజీ కళాశాలలు), పురుషుల 5వేలమీటర్ల రన్నింగ్‌లో ఎన్.రాజేష్(గరివిడి వెటర్నరీ కాలేజ్), పురుషుల డిస్కస్‌త్రోలో ఎం.వెంకటప్రసాద్(తిరుపతి డెయిరీ టెక్నాలజీ), పురుషుల లాంగ్ జంప్‌లో ఎస్.విజయ్(తిరుపతి వెటర్నరీ కాలేజ్), మహిళల విభాగంలో వి.సాయిపూజిత(గరివిడి వెటర్నరీ కళాశాల), పురుషుల ట్రిపుల్ జంప్‌లో జి.మహేశ్వర్‌రెడ్డి(గన్నవరం ఎన్టీఆర్ వెటర్నరీ కాలేజ్) ప్రథమస్థానం సాధించారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య, ఓఎస్‌పి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు, ఫిజియాలజీ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్య క్రీడా, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

భారీ అలలకు కొట్టుకెళ్లిన వైనం ● తిరుపతి జిల్లాలో దుర్ఘటన



భానుప్రకాష్ - లోకేష్

వాకాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ దుర్ఘటన తిరుపతి జిల్లాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిట్టమూరు మండలం మల్లాంలోని సీవీఎస్‌ఆర్ ఇంటర్మీడియట్ కళాశాలలో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు కాలేజీకని చెప్పి ఇంట్లోనుంచి బయల్దేరారు. ఆ తర్వాత వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరానికి చేరుకున్నారు. గురువారం ఉదయం 11.45గంటలకు సముద్రంలో దిగి స్నానం చేస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన భారీ అలలకు నెల్లూరుజిల్లా కావలి ప్రాంతం బంగారుపాళెం గ్రామానికి చెందిన మామిడి లోకేష్ (17), చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామానికి చెందిన ఇంగిలాల భానుప్రకాష్ (18)లు సముద్రంలోకి కొట్టుకుపోయారు. భయపడిన మిగిలిన ఆరుగురు ఒడ్డుకు చేరుకుని కేకలు పెట్టారు. అక్కడున్న మత్స్యకారులు గమనించి.. రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విద్యార్థులు ఇద్దరూ గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మెరైన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు మొదలుపెట్టినా ఆచూకీ లభించలేదు. చీకటిపడటంతో గాలింపు చర్యలు ఆపేశారు. శుక్రవారం ఉదయం నుంచి తిరిగి మొదలుపెడతామని పోలీసులు తెలిపారు. గల్లంతైన విద్యార్థుల కుటుంబసభ్యులు సముద్ర తీరానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కాగా, లోకేష్.. వాకాడు మండలం వైట్‌కుప్పంలోని తన మామ ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్నాడు. భానుప్రకాష్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు స్నేహితులు తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రాతి క్వారీని మూసేయండి
● వానగుట్టపల్లె గ్రామస్తుల ధర్నా



ధర్నా చేస్తున్న వానగుట్టపల్లె గ్రామస్తులు

కుప్పం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇళ్లను, ఆరోగ్యాలను ధ్వంసం చేస్తున్న రాతి క్వారీని మూసి వేయాలంటూ వానగుట్టపల్లె గ్రామస్తులు ధర్నాకు దిగారు. కుప్పం మండలం ఆవులనత్తం రెవెన్యూ పరిధిలో వానగుట్టపల్లె సమీపంలో ఓ రాతి క్వారీ ఉంది. ఇక్కడున్న పెద్దపెద్ద బండలను బాంబులు పెట్టి పేల్చి జల్లిని తయారు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ఈ క్వారీతో సమీపంలోని ఇళ్లు పగుళ్లు బారుతున్నాయి. అలాగే క్వారీ నుంచి పైకిలేచే దుమ్ము కారణంగా పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో అనారోగ్యం పాలవుతున్నారు. దీంతో గ్రామస్తులు ఏకమై రాతి క్వారీని మూసివేయాలంటూ రెండు రోజుల నుంచి ధర్నాకు దిగారు. తహసీల్దారు చిట్టిబాబు, వీఆర్వో ఉష తదితరులు ఆందోళనకారుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు విన్నారు. క్వారీని పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, రాత పూర్వకంగా సమస్య గురించి ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే గ్రామస్తులు వినకుండా ధర్నా కొనసాగించారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం లింగాపురానికి చెందిన జ్యోతి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి జ్యోతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మోహన్‌బాబు, గిరి, నేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తేనే పాల ఉత్పత్తి



పశువులకు చికిత్సలు అందిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాడి రైతు లు మెలకువలు పాటిస్తే అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చని పశువైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన బొవియన్ ఫార్మ కంపెనీ ఆధ్వర్యంలో చౌడగానిపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లేగదూడలకు నట్టల నివారణ మందులు, బూటాక్స్ పిచికారీ చేశారు. పశువుల గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బివియన్ ఫార్మ కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది అనూష, మౌనిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సుహేల్‌బాషా క్షమాపణ చెప్పాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల నిరసన

పుంగనూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి టీడీపీ మైనారిటీ నాయకుడు సుహేల్ బాషా క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ మైనారిటీ నాయకుల తీరుపై బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, అధికారుల వద్ద పనులు చేయించుకోవాలే గాని వారిపై ధర్నాలు, నిరసనలు చేయడం, బెదిరించడం సరికాదన్నారు. అధికార పార్టీలో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడానికి ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు, మఠంబాబు, అమరనారాయణ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

లద్దిగంలో శ్మశానం ఆక్రమణల తొలగింపు



శ్మశానంలో సర్వే చేస్తున్న అధికారులు

చౌడేపల్లె, జనవరి 9: (ఆంధ్రజ్యోతి): లద్దిగంలో శ్మశానం ఆక్రమణలు తొలగించినట్లు సర్వేయర్ గుణశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ లద్దిగం గ్రామంలో సర్వే నంబరు 56/10లో 85 సెంట్ల భూమిలో శ్మశానం ఉందన్నారు. అయితే కొందరు శ్మశానం ఆక్రమణ చేసుకున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. శ్మశానం భూమిని సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేశామని.. ఆక్రమణలు తొలగించినట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వ్యక్తి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ సహదేవి, సిబ్బంది

పెద్దపంజాణి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలం రాజుపల్లి వద్ద గురువారం అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సహదేవి తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని అప్పినపల్లికి చెందిన గంగాధరరెడ్డి, మాధవరెడ్డి ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా 92 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు గుర్తించామన్నారు. గంగాధరరెడ్డిని అరెస్టు చేయగా మాధవరెడ్డి పారిపోయాడని, వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీటీడీ చైర్మన్, ఈవోలపై చర్యలు తీసుకోవాలి



కార్యాలయంలో మాట్లాడుతున్న మునిరత్నం

పలమనేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తుల ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన టీటీడీ చైర్మన్, ఈవోలను వెంటనే విధుల నుంచి తొలగించాలని మానవ హక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డీవీ మునిరత్నం ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ టోకన్లు జారీ చేసేందుకు ముందస్తు తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమయ్యారని.. వీరి వైఫల్యం కారణంగానే చనిపోవాల్సి వచ్చిందని తెలిపారు.

భూ రికార్డుల ఆధునికీకరణకే రీసర్వే



ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది

చౌడేపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భూ రికార్డుల ఆధునీకరణ కోసమే రీసర్వేలు చేయనున్నట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రీసర్వే కోసం లద్దిగం పంచాయతీ పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనట్లు తెలిపారు. వందేళ్ల క్రితం బ్రిటీష్ ప్రభుత్వం సర్వేలు చేసి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సాంకేతికతను అందిపుచ్చుకుని రీసర్వేలు చేసి నూతనంగా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి రికార్డులు అధునీకరించనున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, సర్పంచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సర్వేయర్ కృష్ణమూర్తి, డీటీ మాధవి, సర్వేయర్ గుణ శేఖర్, విజయ్ కుమార్, ఆర్ఐ భారతి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

●సోమల: రీసర్వేలతో ప్రభుత్వ భూములు గుర్తించడం జరుగుతుందని సోమల తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. గురువారం సోమల మండలం మిట్టపల్లెలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించి రైతులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 20 నుంచి మిట్టపల్లెలో ప్రత్యేక రీసర్వే జరుగుతుందని గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాలు, డీకేటీ, పట్టా భూములను గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, డీటీ ఇబ్రహీం, సర్వేయర్ షానవాజ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

సదుం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో నియోజకవర్గ స్థాయిలో జరిగిన జోనల్ పోటీల్లో సదుంలోని జ్యోతిబాఫూలే గురుకులం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తొమ్మిదో తరగతి విద్యార్థి మహేంద్ర నాయుడు రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. 800 మీటర్ల రన్నింగ్, హైజంప్, ట్రిపుల్ జంప్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్, 150 మీటర్ల పరుగు పందెంలో సాత్విక్ తృతీయ బహుమతి సాధించారు. గ్రూప్ ఈవెంట్లలో 17 బహుమతులను విద్యార్థులు సాధించి నియోజకవర్గ స్థాయిలో పాఠశాలకు మంచి పేరు సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

2న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వెంకట గాయిత్రి సేవా ట్రస్టు సభ్యులు

పుంగనూరు రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 2న తిరుపతిలో నిర్వహించే బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పుంగనూరు వెంకట గాయిత్రి సేవా ట్రస్టు సభ్యులు కోరారు. గురువారం పుంగనూరులో పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ వివాహ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు శేషగిరిరావు, రామమూర్తి, విశ్వనాథం, సుబ్బారావు, నాగభూషణంరావు, మధుకుమార్, శివకుమార్, మహేశ్‌కుమార్, రమణారావు, కృష్ణమూర్తి, గిరి, ప్రణీత్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఘర్షణ



బాధితులను విచారిస్తున్న సీఐ శంకరయ్య

కుప్పం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో డబ్బా వాళ్లు అనబడే సామాజిక వర్గానికి చెందిన ఇరు కుటుంబాల మధ్య గురువారం జరిగిన ఘర్షణ కారణంగా పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డులో నివసించే కుటుంబంలోని అమ్మాయికి, పాతపేటలో నివసించే కుటుంబంలోని అబ్బాయికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో అమ్మాయి కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. వీరిద్దరిని కలిపే క్రమంలో ఇరు కుటుంబాలకు చెందిన వారు గురువారం ఒకచోట సమావేశమై చర్చలు జరిపారు. ఈ చర్చల్లో తమిళనాడుకు చెందిన కుటుంబ సభ్యులు ఉన్నారు. చర్చల సందర్భంగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి పరస్పరం దాడులకు దిగారు. ఈ ఘర్షణలో పలువురు గాయాలపాలై కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు శ్రీవారి పాదక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి

సదుం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లెలో వెలసిన శ్రీవారి పాదక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజ, అభిషేకం, అఖండ గోవింద నామస్మరణలు, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఉత్తర వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

కల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి, దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు శుక్రవారం జరగనున్న వైకుంఠ ఏకాదశి వేడుకలకు ముస్తాబయ్యాయి. 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.



●సోమల: సోమలలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగ నిర్వహిస్తున్నట్లు అర్చకులు గోపిస్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం రెండు గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణ చేపడుతారు. అనంతరం ఉత్తర వైకుంఠ ద్వార సర్వదర్శనం, రాత్రి గ్రామోత్సవం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలోని కమ్మపల్లె ఆలయంలోను, సోమల వెంకటేశ్వరస్వామి పాదాల ఆలయం, మిట్టపల్లె, బురుజుపల్లె, చింతలవారిపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు.

సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



పెద్దపంజాణి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం

పలమనేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని .. పంచాయతీల్లో సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలాజీ అన్నారు. గురువారం పెద్దపంజాణి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ కెళవాతి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులు మండలంలోని పాఠశాలల్లో సమస్యలు పట్టించుకోకుండా ఉపాధ్యాయుల యూనియన్ల మధ్య విభేదాలకు కారణం అవుతున్నారని.. దీంతో మండలంలో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. వీరప్పల్లిలో నాడు-నేడు పనుల్లో నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

●గంగవరం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశాన్ని సర్పంచులు, ఎంపీటీసీలు బహిష్కరించి నిరసన తెలిపారు. సమావేశానికి హాజరైన ఎంపీపీ వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యురాలు పార్వతి మాట్లాడుతూ తమకు కనీస సమాచారం అందించడం లేదని ఎంపీడీవో సురేష్‌బాబును ప్రశ్నించారు. మామడుగులో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రతిపాదనలు పంపి 5 నెలలు అవుతున్నా.. ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదని సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. ఎంపీడీవోను కలవడానికి వచ్చినా కనీస మర్యాద లేదని కీలపల్లె ఎంపీటీసీ నాగేంద్ర ప్రశ్నించారు. 18 సచివాలయాల పరిధిలోని కార్యదర్శులకు ఒకేసారి షోకాజ్ నోటీసులు ఎందుకిచ్చారని, సచివాలయ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని సర్పంచుల సంఘ అధ్యక్షులు గిరిరాజారెడ్డి ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం సమాచారాన్ని పోస్టులో పంపడం ఏంటని.. ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద ఇవ్వడం లేదని ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో సంతకం చేయకపోవడంతో పదో తేదీ శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.



సమావేశాన్ని బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరం



గర్భిణులకు సూచనలిసున్న హెచ్‌ఈ రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

రొంపిచెర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరమని వైద్యాధికారి దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు పరీక్షలు చేశారు. రక్తహీనత గుర్తించి మందులు అందించారు. ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పులు సురక్షితమని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

●సోమల: తల్లిదండ్రులు చక్కటి పౌష్టికాహారం అందిస్తేనే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని కందూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నీలిమా, డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. గురువారం కందూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలను బడికి పంపడమే కాకుండా చదువుపై పర్యవేక్షించాలన్నారు. హెచ్‌ఎంలు రాజశేఖర్,లక్ష్మీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహతి ఫౌండేషన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌చందర్, సీహెచ్‌వో అనూరాధ, ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కావేటిగారిపల్లి విద్యార్థులు



విద్యార్థులు నరేంద్ర, జ్ఞానశేఖర్‌తో ఉపాధ్యాయులు

కల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.నరేంద్ర, జి.జ్ఞానశేఖర్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఛాంపియన్ షిప్ హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మంజువాణి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరు నగరంలోని హాకీ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఫెడరేషన్ అఫ్ ఇండియన్ హాకీ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ హాకీ పోటీల్లో కావేటిగారిపల్లి విద్యార్థులు నరేంద్ర, జ్ఞానశేఖర్ పాల్గొని ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. దీంతో అన్నమయ్య జిల్లాలో త్వరలో జరగబోవు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఛాంపియన్ షిప్ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. పాఠశాల హెచ్‌ఎం మంజువాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏకగ్రీవంగా వీఆర్‌వో, వీఆర్‌ఏ సంఘ ఎన్నికలు



ప్రకాశ్,



బద్రీనాథ్

గంగవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల వీఆర్‌వో, వీఆర్‌ఏల సంఘ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు వీఆర్‌వోల సంఘ గౌరవ అధ్యక్షురాలు పద్మావతమ్మ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆమె అధ్యక్షతన వీఆర్‌వో, వీఆర్‌ఏల సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీఆర్‌వోల సంఘ అధ్యక్షులుగా టి.వెంకటేష్, ఉపాధ్యక్షులుగా సుజాతమ్మ, కార్యదర్శిగా వినయ్‌కుమార్, ఉపకార్యదర్శిగా మురళీకృష్ణ, కోశాధికాగా వినోద్‌కుమార్, ఈసీ మెంబర్లుగా మనోహర్, సుధాకర్, జీవితలను ఎన్నుకున్నారు. అలాగే వీఆర్‌ఏల సంఘ అధ్యక్షులుగా ప్రకాష్, ఉపాధ్యక్షులుగా బద్రీనాథ్, కార్యదర్శిగా ఢిల్లీబాబు, ఉపకార్యదర్శిగా మునినారాయణ, కోశాధికారిగా దీపిక, ఈసీ మెంబర్లుగా సుబ్బరామ్, సంతోష్, హరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి

సోమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో శివరత్న సూచించారు. గురువారం మండలంలోని సోమల, జయంతి కాలనీ, అడుసుపల్లె, నంజంపేట పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలును ఆమె తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు హరినాథ్, కుసుమాంబ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

20లోపు అందుబాటులో మెడికల్ రికార్డులు

కుప్పం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ ఆసుపత్రిలో 2019 సంవత్సరానికి ముందు వైద్యం పొందినవారి వైద్య పరీక్షల రికార్డులు ఆసుపత్రి పాలసీ ప్రకారం తొలగిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.కె.సుబ్రమణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అప్పట్లో వైద్యం పొంది వైద్య పరీక్షల రికార్డులు కావాల్సిన వారు ఫిబ్రవరి 20వ తేదీలోపు ఫోన్ నంబర్ 9959011628 ను సంప్రదించాలని కోరారు.

నేడు బడ్జెట్ సమావేశం

పలమనేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ సమావేశ భవనంలో ఈనెల 10న శుక్రవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.వి.రమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

దురదృష్టకర సంఘటనపై రాజకీయం తగదు

శాంతిపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన దురదృష్టకర సంఘటనపై వైసీపీ రాజకీయం చేయడం తగదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. తొక్కిసలాటలతో పలువురు మృతి చెందడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జరిగిన సంఘటన ఎంతో విషాదకరమని, సీఎంతో సహా ప్రభుత్వ యంత్రాంగం ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారని, రాష్ట్ర ప్రభుత్వం క్షతగాత్రులకు అన్ని విధాలా వైద్యసాయం అందిస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై వైసీపీ నేతలు సలహాలు, సూచనలు అందించి సహకరించాల్సిన విషయాన్ని వారు విస్మరించారన్నారు. జరిగిన సంఘటనను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం తగదని ఆయన హితవుపలికారు.

కాటిపేరిలో చెరువుల వేలంతో రూ.68 వేల ఆదాయం

చౌడేపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాటిపేరి పంచాయతీలో చేపల చెరువుల వేలంతో రూ.68 వేలు ఆదాయం వచ్చినట్లు ఈవోఆర్డీ కృష్ణవేణి పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ కాటిపేరి చెరువు రూ.4,1500 లకు గంగపుత్ర బెస్తసంఘం సభ్యులు, రేణికుంట చెరువు రూ.8,500లకు గంగాధర్, మాదిగకుంట చెరువు రూ.5 వేలకు మోహన్‌రెడ్డి, యాతకుంట చెరువు రూ.13 వేలతో శంకర్ దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దొరబాబు, నాయకులు కుమార్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

రొంపిచెర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని.. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులతో సమీక్షించారు. ఇంటింటికీ వెళ్లి పింఛనుదారులను జియో ట్యాగింగ్ చేయాలని కార్యదర్శులకు సూచించారు. గోకులాల నిర్మాణాలు, ఎన్‌ఆర్‌జీఎస్‌లో కూలీలకు పనులు కల్పించడం, మురుగునీటి కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈవోపీఆర్‌డీ సత్యంరెడ్డి, కార్యదర్శులు, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



కల్లూరు పాఠశాలలో ముగ్గులు వేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



భోగి మంటల చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థులు

రామకుప్పం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బగలనత్తం ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో భోగి మంటలు వేసి, పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు ప్రతిష్ఠించారు. ఈ ప్రధానోపాధ్యాయుడు నాగరాజు,ఉపాధ్యాయులు దేవకుమార్, కృష్ణమూర్తి, రాధాబాయి, కౌశర్ అహ్మద్, మోహనకుమారి, జానకి పాల్గొన్నారు.

●కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, ఎన్‌జీసీ సమన్వయకర్త వెంకటశిద్దులు తెలిపారు. నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, వేణుగోపాల్, స్నేహమాలిని, ఈశ్వరయ్య, వెంకటరత్నం,చలపతి పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లి: నెల్లిపట్ల ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం అందరూ కలిసి భోగి మంటలు వేశారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

●పుంగనూరు రూరల్: పుంగనూరులోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, న్యాయవాది బి.వెంకటముని యాదవ్, పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

●భాష్యం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండు వేడుకల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి పుంగనూరు ఆవుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం పిల్లలకు పండుగపై వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులు



రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమిలో...

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదుకు
కృషి చేయడం అభినందనీయం



బెంగళూరులో పాలసముద్రం వాసులతో విప్ డాక్టర్ థామస్

పాలసముద్రం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదును ఎక్కువ మంది చేత చేయడానికి కృషి చేసిన పాలసముద్రం మండల టీడీపీ నాయకులను బెంగళూరులో ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ గురువారం కలసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించేందుకు కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పాలసముద్రం మండల నాయకులు ఎక్కువ మంది రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకోవడంతో గంగాధరనెల్లూరు నియోజకవర్గం రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచిందన్నారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారందరినీ ముఖ్యమంత్రితో కాఫీకి తీసుకెళతామన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, టీడీపీ చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి వాసు నాయుడు, నాయకులు తాళ్లూరు శివ, వెంకటేశులు నాయుడు, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి టీడీపీ నేతల శుభాకాంక్షలు



హైదరాబాద్‌లో చిత్తూరు టీడీపీ నేతల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు జన్మదినం సందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఎంపీ జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకునేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. కాగా బుధవారం తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ప్రమాదం జరగడంతో ఎంపీ జన్మదిన వేడుకలను నిలిపివేశారు. కాగా ఎంపీ హైదరాబాద్‌లో ఉండటంతో కొంతమంది టీడీపీ నేతలు అక్కడికి వెళ్లి కేక్ కట్‌చేసి ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, సునీల్ కుమార్ చౌదరి, కాజూరు శ్రీనివాస్, వినోద్, మూర్తి, రమేష్, రాకేష్, కుట్టి రాయల్, వినాయక గౌండర్, పూర్ణచంద్రరావు, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, ధరణి ప్రకాష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

తిరుపతిలో తొక్కిసలాటను రాజకీయం చేయొద్దు

చిత్తూరు సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల సందర్భంగా జరిగిన తొక్కిసలాటను రాజకీయం చేయకూడదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ చెప్పారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొక్కిసలాటలో 6 మంది మృతిచెందడం దురదృష్టకరమని తెలిపారు. మృతిచెందిన వారి కుటుంబాలకు పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. సహాయక చర్యలను పర్యవేక్షించడానికి హుటాహుటిన ముగ్గురు మంత్రులను పంపారని అన్నారు. ఈ దురదృష్టకర సంఘటనను వైసీపీ అధినేత జగన్ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూడటం, సీఎం చంద్రబాబుపై విమర్శలు చేయడం తగదని ఆయన చెప్పారు.

హోమ్ ట్రయాంగిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): హోమ్ ట్రయాంగిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఒక కుటుంబం, వ్యాపారవేత్త, వాక్ టూ వర్క్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మెప్మా కార్యాలయంలో పట్టణ బ్యూటీషన్, కార్పెంటర్, ప్లంబర్, టీవీ మెకానిక్, గీజర్ మెకానిక్ తదితర వృత్తులపై ఆసక్తి ఉన్న వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా సేవలు అందిస్తూ ఆదాయాన్ని పొందడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ అధికారులు ప్రసాద్, హేమశేఖర్, మెప్మా సిబ్బంది స్వరూప, హిమబిందు, లావణ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

పాత రికార్డుల ప్రకారమే న్యాయం చేయాలి

గుడిపాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో చేసిన రీసర్వే వల్ల చాలామంది రైతుల భూములను ఇతర రైతుల పేర్లపై నమోదు చేశారని, వాటిని రద్దుచేసి పాత రికార్డుల ప్రకారమే న్యాయం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని మొగరాలపల్లి, చీలాపల్లిలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్పందిస్తూ భూములను సర్వే చేయించి, అర్హులైన రైతులందరికీ న్యాయం చేస్తామని హామీయిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంగీత, సోఫియా, అరుణ్, టీడీపీ సీనియర్ నాయకులు హరిబాబు, రీసర్వే డీటీ రూపాదేవి, ఆర్‌ఐ రామసాయి, సర్వేయర్ గోపీనాథ్, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో టీడీఆర్ కమిటీ సమావేశం



టీడీఆర్‌పై కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్ నరసింహ ప్రసాద్ అధ్యక్షతన టీడీఆర్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో భాగంగా కమిటీ సభ్యులు టీడీఆర్ జారీ అంశంపై చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రికార్డులను పరిశీలించి టీడీఆర్ జారీపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో టీడీఆర్ కమిటీ సభ్యులు ఏసీపీ నాగేంద్ర, తహసీల్దార్ కళావతి, సబ్ రిజిస్ట్రార్ విజయ్, చుడా పీవో మోహన్, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటనపై థామస్ దిగ్ర్భాంతి

వెదురుకుప్పం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి టికెట్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నామని తెలియజేశారు.

ఎవరు బాధ్యత వహిస్తారు?: నారాయణస్వామి

తిరుపతిలో జరిగిన ఘటనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లో ఎవరు బాధ్యత వహిస్తారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రశ్నించారు. తమ పాలనలో ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ● తొక్కిసలాటకు పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని జీడీనెల్లూరు వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి మరో ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.5కోట్ల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: సీపీఐఎంఎల్

ప్రాణాలు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ రూ.5కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐఎంఎల్ జిల్లా నేత కొత్తపల్లి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. గురువారం కార్వేటినగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు శుక్రవారం వైకుంఠ ఏకాదశి పండుగను జరుపుకోనున్న నేపథ్యంలో పలు ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చేశారు. స్థానిక మహాలక్ష్మి, గోదాదేవి, ఆంజనేయ సమేత వెంకటేశ్వర ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. కోదండ రామాలయంలో శిఖర దర్శనం, గిరింపేట వీరాంజనేయ, పొన్నియమ్మ గుడి వీరాంజనేయ, సంతపేట విజయలక్ష్మి కాలనీ శ్రీరంగనాథ, కట్టమంచి వరదరాజ, రంగాచారి వీధి రాజుగుడుల్లో వైకుంఠ ఏకాదశి పండుగను నిర్వహించనున్నారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో భక్తుల ఉపవాస జాగరణకు గాను ప్రత్యేక భజన, సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో మునిశేఖర్ తెలిపారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), జనవరి 9(ఆంధ్రజ్యోతి):స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కర్ణాటకలోని హసన్ ఎమ్మెల్యే రేవన్న, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి, తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వీరికి ఈవో పెంచలకిషోర్ స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిత్తూరు సీఐ శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వర ఆలయానికి పీఠాధిపతులు



దుస్తులు వితరణ చేస్తున్న పీఠాధిపతులు

నగరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధి కీళపట్టు త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయానికి శ్రీఓం పంచాశక్తి పీఠాధిపతులు దేవియమ్మ, జ్ఞానశక్తియేంద్ర సరస్వతి గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానం చేశారు. ఇద్దరు పిల్లలకు దుస్తులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎంపీ దగ్గుమళ్ల జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న తిరుమల

శ్రీరంగరాజపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు జన్మదిన వేడుకలను గురువారం తయ్యూరు టీడీపీ మాజీ ఎంపీటీసీ తిరుమల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐ బాలు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, మాజీ ఎంపీటీసీ వేమనాయుడు, లోకనాథం, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కార్వేటినగరంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న చెంగల్రాయయాదవ్, నాయకులు

వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం కార్వేటినగరం వృద్ధాశ్రమంలో టీడీపీ నాయకులు వేడుకలను జరుపుకున్నారు. వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్వేటినగరం టీడీపీ మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా రోడ్డుపై కూలిన చెట్టు



నగరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డు యాక్సిస్‌బ్యాంక్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న చెట్టు గురువారం ఉదయం అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో అటువైపుగా వస్తున్న బైక్‌పై పడటంతో రమేష్(62) అనే వ్యక్తి కాలికి గాయం కావడంతో పాటు ద్విచక్ర వాహనం దెబ్బతింది. నిత్యం రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన వ్యక్తిని స్థానికులు వైద్యశాలకు తరలించారు. మున్సిపల్ అధికారులు చెట్టును అక్కడి నుంచి తొలగించారు.

వన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా గురువారం క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఏర్పాట్లను ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి పర్యవేక్షించారు.

ఆపస్ క్యాలెండరు, డైరీ ఆవిష్కరణ



క్యాలెండరు, డైరీని ఆవిష్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ శేఖర్

వెదురుకుప్పం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) క్యాలెండరు, డైరీని గురువారం కార్వేటినగరంలో డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ ఆవిష్కరించారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలాజీ ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఆ సంఘ నాయకులు, డైట్ అధ్యాపకులు హాజరయ్యారు.

భక్తి ప్రపత్తులతో మాస నారాయణి సేవ



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో గురువారం మాస నారాయణి సేవను భక్తులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు భక్తులకు ఉచితంగా పూజా ద్రవ్యాలను అందజేశారు. నగరంలోని పేదలకు భోజన ప్యాకెట్లుఅందజేశారు. సత్యసాయి భజనమండలి, బాలవికాస్, మహిళా విభాగం, యూత్ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి ఊరగుట్టను కాపాడండి

● శ్మశాన స్థలాన్ని ఆక్రమించారని యానాదుల మొర



యానాదుల సమస్యలు వింటున్న సీపీఎం నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారుల నుంచి ఊరగుట్ట ప్రాంతాన్ని కాపాడాలని, యానాదులకు కేటాయించిన శ్మశాన స్థలాన్ని ఆక్రమించకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు కోరారు. గురువారం సీపీఎం నాయకులు యానాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని మొగిలి రెవెన్యూ సర్వే నెంబర్ 61లో ఉన్న ఊరగుట్టలో 59 ఎకరాల స్థలాన్ని గతంలో పని చేసిన ఇన్‌చార్జీ తహసీల్దార్ కొంత మంది భూస్వాములకు డీకేటీ పట్టాలు మంజూరు చేశారన్నారు. దీన్ని అదునుగా తీసుకున్న కొంత మంది భూస్వాములు కొన్ని సంవత్సరాలుగా యానాదులు సాగు చేసుకుంటున్న భూమిని, శ్మశాన స్థలాన్ని కబ్జా చేశారని చెప్పారు. దీనిపై పలు మార్లు యానాదులు సీపీఎం ఆధ్వర్యంలో అధికారులకు వినతులు చేసినా కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారే తప్పా పరిష్కారమార్గం చూపలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఊరగుట్ట ప్రాంతంలో భూస్వాములకు ఇచ్చిన డీకేటీ పట్టాలను రద్దు చేసి ఆ భూములను ఇళ్ల స్థలాలు, స్కూల్ భవనాలు, ఆటస్థలంగా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సురేంద్రన్, మండల నాయకులు మురళి, యానాదుల సంఘ నాయకులు నిర్మల పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

● పూర్వ విద్యార్థి డ్రైవర్ రామయ్య ఔదార్యం



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న రామయ్య భార్య ఢిల్లీ

గంగాధరనెల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగవూరుకు చెందిన కలవకుంట రామయ్య గంగాధరనెల్లూరు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి. ప్రస్తుతం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన తాను చదువుకున్న హైస్కూల్లో ఈ ఏడాది 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందచేయాలని నిర్ణయించుకున్నారు. విధుల్లో బిజీగా ఉన్నందున రామయ్య రాలేకపోవడంతో తన భార్య ఢిల్లీ ద్వారా 55 మంది 10వ తరగతి విద్యార్థులకు రూ.20వేలు విలువచేసే స్టడీ మెటీరియల్‌ను గురువారం అందచేశారు. ఈసందర్భంగా హెచ్ఎం హేమలత, అసిస్టెంట్ హెచ్ఎం దినకర్‌లు మాట్లాడుతూ పూర్వవిద్యార్థి రామయ్య కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నప్పటికీ ఆయన దాతృత్వం ప్రశంసనీయమని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మిగతా పూర్వవిద్యార్థులు కూడా విద్యార్థులకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా రామయ్య భార్య ఢిల్లీని హెచ్ఎంతో పాటు టీచర్లు శాలువకప్పి, పూలమాలతో సన్మానించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

● రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్



వార్డు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీ విశ్వనాథ్

చిత్తూరు అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పీజీఆర్ఎస్, ఆన్‌లైన్ ద్వారా అందే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.విశ్వనాథ్ అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన నగర పరిధిలోని 49వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పన్నుల వసూళ్లపై సమీక్షించారు. డిమాండ్, ఇప్పటి వరకు చేసిన వసూళ్లు, బకాయిలు, దీర్ఘకాలిక బకాయిలపై ఆరాతీశారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన దరఖాస్తులు, అనుమతుల అంశాలను పరిశీలించారు. వార్డు సచివాలయ కార్యదర్శుల హాజరు నమోదు, మూమెంట్ రిజిస్టర్, పబ్లిక్ సర్వీసెస్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేసి నగరపాలక ఆదాయాన్ని పెంచాలన్నారు. కమిషనర్ నరసింహప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేపంజేరి చర్చి సభామణియంగా మురళి



గంగాధరనెల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరి దళితవాడలోని చర్చి సభామణియం (మూపనార్)గా ఎస్.మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వేపంజేరి దళితవాడలోని ఫుల్ గాస్పుల్ చర్చి ఆఫ్ ఇండియా చర్చికి సుమారు 70 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చర్చికి ఇప్పటివరకు సభామణియం పోస్టు లేకపోవడంతో కొత్తగా ఆ పోస్టును ప్రవేశపెట్టిన చర్చి సభ్యులు ఏకగ్రీవ తీర్మానంతో ఆ దళితవాడలోని ఎస్.మురళిని ఎన్నుకొన్నట్లు గురువారం పేర్కొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

వెదురుకుప్పం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారం పంచాయతీలోని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతు చర్యలను చేపట్టినట్లు గురువారం జనసేన నేత, సర్పంచ్ కామసాని శేఖర్‌రెడ్డి తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



నాగేశ్వరరావు

వెదురుకుప్పం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేస్తున్న నాగేశ్వరరావుకు కుప్పం ద్రవిడియన్ యూనివర్శిటీలో డాక్టరేట్ ప్రదానం చేశారని వెదురుకుప్పం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద గురువారం తెలిపారు. ప్రొఫెసర్ దిలీప్ పర్యవేక్షణలో 'టోరెంట్స్ ఆఫ్ ఇంటాగేషన్-ఎక్రిటికల్ స్టడీ ఆఫ్ అరుంధతి రాయ్స్ సెలెక్ట్ నాన్ ఫిక్షన్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారని తెలిపారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు





చిత్తూరు న్యూయార్క్ స్కూల్లో, అరుణాచల కళాశాలలో - బంగారుపాళ్యంలో ముగ్గులు వేస్తున్న బాలురు

చిత్తూరు సెంట్రల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక న్యూయార్క్ స్కూల్లో ఛైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. నాటికలు ప్రదర్శించారు. మిట్టూరులోని అరుణాచల జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి గోమాత పూజ, రంగవల్లికలు, నృత్యాలు, భోగి మంటలతో వేడుకలు జరుపుకున్నారు.

బంగారుపాళ్యం (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలోని గిరిజనసంక్షేమ హాస్టల్ విద్యార్థులు వసతి గృహాన్ని పచ్చని తోరణాలతో అలంకరించి, సాంప్రదాయ దుస్తులతో అలరించారు. ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య సంక్రాంతి విశిష్టత గురించి వివరించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తవణంపల్లె (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాణిపాకంక్రాస్ వద్ద గల వినాయక విద్యామందిరం పాఠశాలలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగవల్లులు వేసి, పూజలు నిర్వహించి భోగి మంటలు వేశారు. కరస్పాండెట్ గణపతినాయుడు విద్యార్థులకు తెలుగు సాంప్రదాయాలు, సంక్రాంతి పండుగ గురించి వివరించారు. సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాధరనెల్లూరు పంచాయతీ అక్కనగారిపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలో హెచ్ఎం గంగాధరం ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో ముగ్గులు, భోగి మంటలు వేసి, కేక్‌కట్ చేశారు. స్కూలు కమిటీ ఛైర్మన్ పూజ, సరిత, రాణెమ్మ పాల్గొన్నారు.

విజయపురం (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఉన్నత పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి గొబ్బియాళ్ళు, ఉట్టి ఉత్సవం, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగిమంట వేశారు. విజయపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రూబన్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం జ్ఞానప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలసముద్రం (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం అరుణోదయ కాన్వెంట్‌లో విద్యార్థులు భోగి మంటలువేసి, పొంగళ్లు పెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్, హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తవణంపల్లెలో బహుమతులు ప్రదానం చేస్తున్న గణపతి నాయుడు



నగరిలో సాంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

నగరి (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని ముడిపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో, నారాయణ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులతో నృత్యాలు చేయడం, పొంగళ్లు పెట్టి లక్ష్మీదేవిని పూజించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సంక్రాంతి పండుగ రోజు చేపట్టే సాంప్రదాయ పద్ధతులను విద్యార్థులు, ఉపాధ్యాయులు నేడు అనుసరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాభావంతో కమ్యూనిటీ హాలు భవన నిర్మాణం



భూమిపూజలో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సేవాభావంతోనే ఆస్పత్రి ఆవరణలో కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి తమవంతు తోడ్పాటు అందిస్తున్నట్లు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) గోల్డ్‌శాఖ కమిషన్ ఛైర్మన్ హర్షవర్ధనరెడ్డి, చిత్తూరు ఎం.వి.కేశవరెడ్డి మోమెరియల్ ఫౌండేషన్ ఛైర్మన్, జేసీఐ జిల్లా చాప్టర్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలో కొత్తగా కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి జేసీఐ చిత్తూరు శాఖ ఆర్థిక సహకారంతో డాక్టర్లు, వైద్యసిబ్బందితో కలిసి వారు గురువారం భూమిపూజచేశారు. ఈకార్యక్రమంలో జేసీఐ జోన్ ఛైర్మన్ భరత్, వైస్ ఛైర్మన్ ప్రమోద్, డాక్టర్ దుర్గాదేవి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ శైల, మండల జేసీఐ అధ్యక్షులు మనోహర్, మానస తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

గుడిపాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో వున్నా ఇటు కేంద్రం, అటు రాష్ట్రం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం శాయశక్తులా కృషిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, రైతులకు గోకులం షెడ్లు, సబ్సిడీ ధరలతో పనిముట్లు, రుణాలు మంజూరు చేస్తోందన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) ఆధ్వర్యంలో కస్తూర్బా నగర పాఠశాల, తేనెబండ హయగ్రీవ పాఠశాలలో గత రెండు రోజులుగా విద్యార్థులు, వారి తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించిన సంగతి తెల్సిందే. గురువారం స్థానిక కస్తూర్బా నగర పాఠశాలలో విజేతలకు నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమల, హరివిల్లు లలిత కళావేదిక గౌరవాధ్యక్షులు వి. హరినాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులను నరసం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.